భద్రం బీకేర్‌ఫుల్



ద్విచక్రవాహనం నడుపుతూ పట్టుబడిన మైనర్ బాలుడు



- మైనర్ల డ్రైవింగ్‌తో ప్రమాదాలు
- పెద్దల గారాబంతో నిబంధనలు బేఖాతరు
- లైసెన్స్ లేకున్నా.. రయ్‌మంటూ దూసుకెళ్తున్నారు
- ర్యాష్ డ్రైవింగ్‌తో కోరి ప్రమాదాలు తెచ్చుకుంటున్న వైనం

జనవరి నుంచి ఇప్పటి వరకు కేసులు

హెల్మెట్ లేనివి	5,000
రాంగ్ రూట్	350
సెల్‌ఫోన్ డ్రైవింగ్	350
ట్రిపుల్ రైడింగ్	50
డ్రంక్ అండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్, రాంగ్ పార్కింగ్, నో యూనిఫాం, నో లైసెన్స్, నో సీట్ బెల్ట్	2,450

నవతరం యువత.. బైక్ రైడింగ్ పట్ల తెగ ఆసక్తి చూపుతున్నారు. వయసు తెస్తున్న ఉత్సాహం.. ఫ్రెండ్స్ ముందు తమ తెగువను చూపాలనే తాపత్రయం వెరసి ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. తల్లిదండ్రులు కూడా బిడ్డలపై మమకారంతో వారడిగిన అధిక సామర్థ్యం గల బైక్‌లు కొనిచ్చి, కడుపుకోతను మిగుల్చుకుంటున్నారు. ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో మైనర్ల డ్రైవింగ్ ప్రధాన కారణంగా మారుతోంది. సబ్బవరం పరిసర ప్రాంతాల్లో ఈ తీరు రాన్రానూ పెరుగుతోంది.

రోడ్డు ప్రమాద మరణాల్లో 70 శాతం ర్యాష్ డ్రైవింగ్ వల్లే

స్పీడ్‌లిమిట్ 40 కి.మీ. దాట కూడని రోడ్లపైనా స్పీడ్ డ్రైవింగ్

తల్లి దండ్రులు అతి గారాబంతో హై ఎండ్ బైక్‌లు కొనిస్తున్నారు



సబ్బవరంలోని డిఫెన్స్ అకాడమీలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ పిన్నింటి రమణ

సబ్బవరం:

నిన్న మొన్నటి వరకూ మెట్రో నగరాల్లో కనిపించే బైక్ స్పీడ్ రైడింగ్ క్రేజ్ నగర శివార్లలో ఉన్న సబ్బవరం పరిసర ప్రాంతాలకూ పాకింది. కష్టపడి చదువుకుని.. గొప్ప స్థాయికి చేరాల్సిన యువత ర్యాష్ డ్రైవింగ్‌తో ప్రమాదాల బారిన పడుతున్నారు. ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని పదేపదే పోలీసులు హెచ్చరిస్తున్నా పట్టించుకోవట్లేదు. వీరిని కట్టడి చేయాల్సిన తల్లిదండ్రులు కూడా తమ చిన్నతనంలో దక్కని ఆనందాలు.. తమ పిల్లలకైనా దక్కాలనే భ్రమలో.. అడిగిన హై ఎండ్ బైక్‌లు కొనిచ్చి, వారి జీవితాలతోపాటు, తమకూ కడుపుకోత మిగిల్చుకుంటున్నారు. ఇటీవల సబ్బవరం స్టేషన్ పరిధిలో ఈ తరహా ర్యాష్, మైనర్ల డ్రైవింగ్ కేసులు పెరుగుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 8,200 ట్రాఫిక్ చలానా కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో తెలుసుకోవచ్చు.

లైసెన్స్ లేకున్నా.. రయ్.. రయ్

సాధారణంగా డ్రైవింగ్ లైసెన్స్ పొందాలంటే కనీసం 18 ఏళ్లు నిండాలి. కానీ రోడ్లపై ఆ వయసులేని మైనర్లు, లైసెన్సు లేనివారు ద్విచక్ర వాహనాలతోపాటు కార్లు, ఆటోలు, వ్యాన్లు నడుపుతూ పోలీసులకు చిక్కుతున్నారు. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతుండటంతో మోటార్ వెహికల్ చట్టం నిబంధనలనూ కఠినతరం చేశారు. మైనర్ల డ్రైవింగ్ కారణంగా ప్రమాదాలు జరిగితే వారితోపాటు వాహన యజమాని, ఆ మైనర్ తల్లిదండ్రులపైనా కేసులు నమోదు చేస్తున్నారు. భారీగా అపరాధ రుసుం కూడా వసూలు చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే 25 ఏళ్ల వయసు వచ్చేవరకూ డ్రైవింగ్ లైసెన్స్ ఇచ్చే అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.



మైనర్లకు, వారి కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న సీఐ పిన్నింటి రమణ

హైవే విస్తరణతో..

సబ్బవరంలో జాతీయ రహదారులు విస్తరించడంతో రోడ్లపై వాహనాల జోరు పెరిగింది. పరిసర గ్రామాలకు చెందిన మైనర్లు రోడ్లపై వాహనాలను జోరుగా నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. గత నెలలో సబ్బవరం జాతీయ రహదారిపై చిన్నయ్యపాలెం వద్ద ఓ ఇంటర్ పూర్తయిన యువకుడు రోడ్డు ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో ట్రాఫిక్ నిబంధనలపై పోలీసులు మరింతగా దృష్టి సారించారు.

మైనర్లే ఎక్కువ

సబ్బవరంలో సీఐ పిన్నింటి రమణ ఆధ్వర్యంలో ఇటీవల ట్రాఫిక్ ఉల్లంఘనులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆకస్మిక వాహన తనిఖీల్లో ర్యాష్ డ్రైవింగ్, హెల్మెట్ ధరించకపోవడం, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తున్నవారిని పట్టుకున్నారు. ఇందులో సగం మంది(ఐదుగురు) మైనర్లు ఉన్నారు. వీరిలో ఏ ఒక్కరూ హెల్మెట్ ధరించకపోవడం గమనార్హం. దీంతో వీరితోపాటు, తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. మరోసారి పట్టుబడితే తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కుటుంబానికి తీరని శోకం



మైనర్లకు రోడ్డు నిబంధనలపై పూర్తి అవగాహన ఉండదు. బాధ్యత తెలియని వయసు కూడా ఓ కారణం. దీంతో వీరికి వాహనాలు ఇచ్చి, డ్రైవింగ్‌ను ప్రోత్సహిస్తే వీరితో పాటు, రోడ్లపై ప్రయాణించే ఇతర వాహన దారులకూ ప్రమాదకరం. రోడ్డు ప్రమాదం జరిగితే ఆ కుటుంబానికి తీరని శోకం మిగులుంది. ఇప్పటికే అనేకసార్లు మా కళాశాలకు పోలీసు అధికారులు వచ్చి, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

– డాక్టర్ బి.సీతాలక్ష్మి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల

తల్లిదండ్రులూ బాధ్యులే!



మైనర్లకు వాహనాలు ఇస్తే వాహనాలు ఇచ్చినవారితో పాటు, తల్లిదండ్రులను కూడా బాధ్యులను చేస్తూ కేసులు నమోదు చేస్తాం. దీనిపై ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా వాహన తనిఖీలు ముమ్మరంగా చేపడుతున్నాం. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పట్టుపడిన మైనర్లను, వారి తల్లిదండ్రులను పిలిచి పోలీస్ స్టేషన్లో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నాం. రిపీట్ అయితే చర్యలు మరింత కఠినంగా ఉంటాయి.

– పిన్నింటి రమణ, సీఐ, సబ్బవరం

క్లుప్తంగా

అయ్యప్పకు ప్రత్యేక పూజలు



పేదలకు బియ్యం వితరణ చేస్తున్న ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి

పెందుర్తి: సుజాతనగర్లోని పూర్ణ పుష్కళ సమేత శ్రీధర్మ శాస్తా అయ్యప్పస్వామి దేవాలయంలో స్వామివారి ఉత్తరా నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్పకు పంచామృతాభిషేకం జరిగింది. అనంతరం విశేషాలంకరణలో స్వామి పూజలందుకున్నారు. మధ్యాహ్నం ప్రసాద వితరణ చేపట్టారు. అయ్యప్పసేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా పేదలకు బియ్యం పంపిణీ చేశారు.

వేంకటాద్రిపై విశేష పూజలు



పూజలందుకున్న వెంకన్న

పెందుర్తి: వేంకటాద్రిపై జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన సోమవారం వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో వేకువజామున హారతి, సేవాకాలం, శాత్తుమురై, తిరుప్పావై పారాయణం, ప్రవచనం, తీర్థగోష్ఠి జరిపారు. 8వ పాశురం వినిపించారు. ఈవో నీలిమ పర్యవేక్షణలో వందలాది మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు.

షాపింగ్ కాంప్లెక్స్ పనుల వేగవంతానికి వినతి



ఈవో త్రినాథరావుకు వినతిపత్రం అందిస్తున్న వర్తక సంఘం అధ్యక్షుడు ముగ్గు కిరణ్

సింహాచలం: సింహగిరిపై ప్రసాద్ స్కీమ్ నిధులతో నిర్మిస్తున్న నూతన షాపింగ్ కాంప్లెక్స్ పనులను వేగవంతం చేసి, వ్యాపారులకు అప్పగించాలని దేవస్థానం ఈవో వి.త్రినాథరావును సింహగిరి వర్తక సంఘం అధ్యక్షుడు ముగ్గు కిరణ్ కోరారు. ఈ మేరకు ఈవోను సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. గత ఏడాది డిసెంబర్ ఆఖరి వారంలో నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారని, ఆరునెలల్లో పూర్తిచేసి వర్తకులకు షాపులు అందిస్తామని చెప్పారని గుర్తు చేశారు. నేటికీ పనులు పూర్తికాలేదని ఈవోకు తెలిపారు. వ్యాపారులు దేవస్థానానికి సహకరించారని, వారి బాధలను అర్థం చేసుకుని త్వరితగతిన పనులు పూర్తిచేయాలని కోరారు. షాపింగ్ కాంప్లెక్స్‌కు దక్షిణ, ఉత్తరం ఇరువైపులా భక్తులు మార్కెట్లోకి వచ్చేలా మెట్లు నిర్మాణం చేయాలని విన్నవించారు.

వృద్ధురాలి అదృశ్యం



ఎల్లంకి బంగారమ్మ

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని కోటనరవ గ్రామానికి చెందిన ఎల్లంకి బంగారమ్మ(62) అదృశ్యంపై పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ కేవీ సతీష్‌కుమార్ తెలిపిన వివరాలు. విజయనగరంలోని పెనుబర్తి వెళ్లేందుకు బంగారమ్మ ఆదివారం సాయంత్రం కోటనరవలోని ఇంటి నుంచి బయలుదేరింది. ఆమె విజయనగరం చేరుకోలేదు. తిరిగి ఇంటికీ రాలేదు. దీంతో కొడుకు ఎల్లంకి చిన్నా రావు ఎంతగా వెదికినా, ఆచూకీ తెలియకపోవడంతో సోమవారం పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440796039 (సీఐ), 8333841380 (హెచ్‌సీ) నంబర్లను సంప్రదించాల్సిందిగా కోరారు.

గోదాదేవికి విశేషంగా తిరువీధి



తిరువీధిలో గోదాదేవికి పూజలు చేస్తున్న అర్చకుడు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం గోదాదేవికి విశేషంగా తిరువీధి నిర్వహించారు. ఉదయం అమ్మవారి సన్నిధిలో పాశుర విన్నపం చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకీలో అధిష్టింపజేసి, ఆలయ బేడా మండపంలో తిరువీధి జరిపారు. విశేష హారతులు అందించారు. అర్చకుడు రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చెక్కుల పంపిణీ

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలోని ఠాగూర్ పరిశ్రమలో ఇటీవల జరిగిన విష వాయువుల లీకేజీలో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు మంగళవారం చెక్కులు పంపిణీ చేయనున్నారు. వీటిని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు చేతుల మీదుగా ఉదయం 10 గంటలకు అందించనున్నట్లు జనసేన పార్టీ నాయకుడు బుగిడి రామగోవిందరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నలుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

సబ్బవరం: మండలంలోని జీవీఎంసీ పరిధిలోని గంగవరం శివారులో పేకాట ఆడుతున్న నలుగురిని స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. సీఐ పిన్నింటి రమణ తెలిపిన వివరాల మేరకు.. గంగవరం శివారులో ఆదివారం రాత్రి పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్ఐ గణేష్ పడాల్ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అదే గ్రామానికి చెందిన మాటూరి వేణుగోపాల్(18), శ్రీను(36), నూకరాజు(35), శ్రీను(31)లను పట్టుకుని అరెస్టు చేశామన్నారు. వారి నుంచి రూ.6,100 నగదు స్వాధీనం చేసుకుని సోమవారం కోర్టులో హాజరు పరచినట్లు సీఐ తెలిపారు. కోడి పందాలు, గుల్లాటలు, పేకాట ఆడినా, బెల్ట్ షాపులు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ స్థానిక పోలీసులకు పట్టుబడిన 13 మందికి కోర్టు రూ.1,30,000 జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ నరసింహరాజు తెలిపారు. సోమవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

గెడ్డ ఆక్రమణకు టీడీపీ కార్పొరేటర్ యత్నం

- అడ్డుకున్న పెందుర్తి రెవెన్యూ అధికారులు, సిబ్బంది



టీడీపీ కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు కుటుంబ సభ్యుల ఆక్రమణలో ఉన్న గెడ్డ పోరంబోకు స్థలం



ఆక్రమణను అడ్డుకున్న ఆర్ఐ హరిప్రసూన, వీఆర్వో రూప

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో అధికార తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధుల కబ్జా పర్వం కొనసాగుతోంది. జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి నడిబొడ్డున వార్డు సచివాలయానికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ గెడ్డ పోరంబోకు స్థలాన్ని స్థానిక కార్పొరేటర్, టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు చెరబట్టారు. ఆ స్థలంలో సోమవారం నిర్మాణం చేసేందుకు సన్నాహాలు చేస్తున్న తరుణంలో సమాచారం అందుకున్న పెందుర్తి రెవెన్యూ సిబ్బంది ఆక్రమణను అడ్డుకున్నారు. సిమెంట్ పిల్లర్ల నిర్మాణం కోసం తవ్విన గోతుల్ని జేసీబీ సాయంతో పూడ్చేశారు. ఆక్రమణను అడ్డుకుంటున్న క్రమంలో స్థానిక సచివాలయ వీఆర్వో రూపను ఆక్రమణదారులు దుర్భాషలాడటంతో ఆమె కన్నీటి పర్యంతం అయింది.

గెడ్డకే ఎసరు పెట్టేలా..

పెందుర్తి సర్వే నెంబర్ 190/9లో దాదాపు 18 సెంట్ల ప్రభుత్వ పోరంబోకు(గెడ్డ) భూమి ఉంది. పెందుర్తి పట్టణంలో ప్రధాన మురుగు కాలువల్లో ఇది ఒకటి. అయితే ఈ గెడ్డ(కాలువ) స్థలంలో దాదాపు 15 అడుగుల మేర ఆక్రమించిన సదరు కార్పొరేటర్ కుటుంబ సభ్యులు శాశ్వత నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నించారు. ఒక ప్రజాప్రతినిధిగా కబ్జాలను అడ్డుకోవాల్సింది పోయి, విధి నిర్వహణలో ఉన్న అధికారులపైనే చిందులు తొక్కడం గమనార్హం. ఇక్కడ జరుగుతున్న గెడ్డ ఆక్రమణను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హరి ప్రసూన తెలిపారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 8 వినతులు



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ హేమావతి

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్-8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వివిధ సమస్యలపై 8 వినతులు అందాయి. జీవీఎంసీ 97వ వార్డు సుజాతనగర్ ప్రాంతంలో కాలువ గట్టు ఆక్రమణ, 95వ వార్డు లక్ష్మీపురంలో రహదారి ఆక్రమణ, 96వ వార్డు దొగ్గవానిపాలెం, పార్వతీనగర్ ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు తొలగించాలని, పార్వతినగర్‌లో చెట్టు కొమ్మల సమస్య, 93వ వార్డు గోపాలపట్నం ప్రాంతంలో అక్రమంగా సెల్లార్లు నిర్మిస్తున్నారని, అదే వార్డులో సర్వే నెంబర్ 4/ఎ/8లో భూమికి తప్పుడు ధ్రువపత్రాలు ఇచ్చారని, 90వ వార్డు సుసర్లకాలనీలో ట్రేడ్ లైసెన్స్ సమస్య, ఇదే కాలనీలో ఐరన్ బడ్డీని తొలగించాలని జోనల్ కమిషనర్ కె.హేమావతికి వినతులు సమర్పించారు. ఆయా ఫిర్యాదులను స్వీకరించి వాటిపై విచారణ జరిపి, తగు చర్యలు తీసుకోవాలని ఏసీపీకి జెడ్సీ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జోన్-8లోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

28, 29 తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలు



జిల్లా మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

పెందుర్తి: సీపీఎం విశాఖ జిల్లా మహాసభలను సుజాతనగర్‌లో ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ గోపాలపట్నం జోన్ కార్యదర్శి బి.జగన్ తెలిపారు. సుజాతనగర్లోని పార్టీ కార్యాలయంలో సోమవారం మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 28న పెందుర్తి జూనియర్ కళాశాల నుంచి సభాస్థలి వరకు మహా ప్రదర్శన ఉంటుందన్నారు. రెండు రోజుల పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రజావ్యతిరేక పాలన గురించి, ప్రజల తరఫున చేయనున్న పోరాటాల గురించి లోతుగా చర్చలు జరుగుతాయన్నారు. మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బి.రమణి, బి.వెంకట్రావు, జోన్ ప్రతినిధులు జక్కాన సత్యనారాయణ, కె.అప్పలనాయుడు, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యం



అర్జీలు స్వీకరిస్తున్న ఎస్‌డీసీ సీతారామారావు, చిత్రంలో తహసీల్దార్ ఆనంద్‌కుమార్



బాటజంగాలపాలెం సదస్సులో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ



తహసీల్దార్ పాల్ కిరణ్‌కు అర్జీలు అందిస్తున్న అడవివరం గ్రామస్తులు

- పెందుర్తి సదస్సులో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సీతారామారావు
- పంచగ్రామాల భూ సమస్యలపై అడవివరంలో అర్జీల వెల్లువ

పెందుర్తి: దీర్ఘకాలికంగా ఉన్న భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ప్రత్యేకాధికారి సీతారామారావు అన్నారు. జీవీఎంసీ 97వ వార్డు పులగానిపాలెంలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఎస్‌డీసీ పాల్గొని రైతులు, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అన్ని రకాలుగా ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. భూ సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని సూచించారు. రెవెన్యూ యంత్రాంగం పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండి సకాలంలో మ్యుటేషన్, ఆన్‌లైన్ ప్రక్రియ, ఇతరత్రా అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కరించాలని సూచించారు. సదస్సులో మొత్తం 49 అర్జీలు రాగా అందులో ఎఫ్-లైన్(భూ సర్వే) కోసం 37, 22ఎ సమస్య పరిష్కారానికి ఒకటి, నాలా కోసం ఒకటి, ఇంటి స్థలం కోసం ఒకటి, భూ ఆక్రమణలను అడ్డుకోవాలని మూడు, ఇతర సమస్యలపై 7 అర్జీలు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు వెల్లడించారు. సదస్సులో కార్పొరేటర్ శానాపతి వసంత, తహసీల్దార్ ఆనంద్‌కుమార్, జోనల్ కమిషనర్ కె.హేమావతి, వీఆర్వోలు, నాయకులు పాల్గొన్నారు.

పంచగ్రామాల భూ సమస్య పరిష్కరించాలి

సింహాచలం: అడవివరంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మొత్తం 25 అర్జీలు వచ్చినట్లు చినగదిలి తహసీల్దార్ పాల్ కిరణ్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు స్థానిక సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అధిక మొత్తంలో గ్రామస్తులు సింహాచలం దేవస్థానంతో ముడిపడి ఉన్న భూసమస్యను పరిష్కరించాలని దరఖాస్తు చేసుకున్నారు. 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం, జీవీఎంసీ ఆర్ఐ స్వాతి, సింహాచలం దేవస్థానం సూపరింటెండెంట్ వెంకట రమణరావు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

- పంచగ్రామాల భూసమస్యతో ఏళ్ల తరబడి రైతులు, నివాసితులు, స్థలాలున్న వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, భూసమస్య పరిష్కారంకోసం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో గ్రామ సభను ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి అధికారులకు విన్నవించారు.
- 22(1సి) నుంచి అడవివరం గ్రామకంఠం భూములను మినహాయించాలని కార్పొరేటర్ పి.వి.నరసింహం అర్జీ దాఖలు చేశారు. పంచగ్రామాల్లో మిగిలిన నాలుగు గ్రామాలకు రిజిస్ట్రేషన్లు అవుతున్నాయని, అడవివరం గ్రామకంఠం భూములకు రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో నివాసితులు ఇబ్బందులు పడుతున్నారని తన అర్జీలో పేర్కొన్నారు.
- బీఆర్‌టీఎస్ బాధితులకు న్యాయం చేయాలని, టీడీఆర్‌ల సమస్య పరిష్కరించాలని కొందరు బాధితులు మొరపెట్టుకున్నారు. టీడీఆర్ విలువ పెంచలేదంటూ మరి కొందరు తమ అర్జీలు పెట్టుకున్నారు.
- దేవస్థానం తమకు ప్రత్యామ్నాయంగా పాతగోశాల వద్ద లేఅవుట్‌లో అందించిన స్థలాలకు రిజిస్ట్రేషన్ హక్కులు కల్పించాలని సింహగిరి నివాసితుల తరఫున ముగ్గు కిరణ్ అర్జీ దాఖలు చేశారు. సింహాచలం దివ్యక్షేత్రం అభివృద్ధికి సహకరించి కొండపై నుంచి కొండ దిగువకు వచ్చామని, తమకు దేవస్థానం స్థలాలు ఇచ్చినా, రిజిస్ట్రేషన్ హక్కులు కల్పించలేదని వాపోయారు.

బాటజంగాలపాలెం సదస్సుకు 12 అర్జీలు

సబ్బవరం: రెవెన్యూ సదస్సుకు వచ్చిన ప్రతి అర్జీని సకాలంలో పరిష్కరిస్తామని తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. మండలంలోని బాటజంగాలపాలెంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. రైతులు తమ భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ఈ సదస్సులు చక్కని వేదికలుగా మారాయని పేర్కొన్నారు. సదస్సులో రైతుల నుంచి వివిధ భూ సమస్యలపై 12 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. వాటిని పరిశీలించి, త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. గ్రామంలో 219 సర్వే నెంబర్లలో 1,137 ఖాతాదారులున్నట్లు పేర్కొన్నారు. గ్రామం మొత్తం 1,262.53 ఏకరాల భూమిలో 417.68 ఎకరాల ప్రభుత్వ భూమి, 844.85 ఎకరాల జిరాయితీ భూమి ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పడాల వెంకట రమణ, రీ సర్వే డీటీ గణపతిరావు, మండల సర్వేయర్ లాలం అప్పారావు, వెలుగు సర్వేయర్ రాంబాబు, వీఆర్వో రామ అప్పారావు, విలేజ్ సర్వేయర్లు ఆసీఫ్, లోకేష్, గ్రామ పెద్దలు వనం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విస్తంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కళాశాల ఎండీ మళ్ల అనూష, జేమ్స్ స్టీఫెన్, ప్రిన్సిపాల్ శివకుమార్ తదితరులు

పెందుర్తి: పినగాడిలోని విస్తం ఇంజినీరింగ్ కళాశాలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలువురు పాస్టర్లు ఏసు సందేశాన్ని వినిపించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ఎండీ మళ్ల అనూష, ఆంధ్రయూనివర్సిటీ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి.శివకుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఆనంద్‌బాబు, డిప్లమో కళాశాల ప్రిన్సిపాల్ కె.వి.కిరణ్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.